## గ్లోబల్ హాస్పిటల్స్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక

### కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన సామాజిక కథ

**ఆనాటి ఉత్సవ ప్రారంభ వేడుక ఎంత ఘనంగా జరగాలో అంత ఘనంగానూ మొదలైంది. తన జీవితమంతా శాస్త్రీయ సంగీత సాధనలోనూ, బోధనలోనూ గడుపుతూన్న సంగీత కులపతి మార్కండేయశాస్త్రి గారి ఆధ్వర్యంలో యీ ఆరాధనోత్సవాలు తక్కువ స్థాయిలో జరుగుతాయని ఎవరూ వూహించరు. సరస్వతీ గాన సభ హాలు అత్యంత సుందరంగా అలంకరింపబడింది. వేదిక అంతా పరిమళాలు విరజిమ్మే రంగురంగుల పూలగుత్తులతో నిండి వుంది - వేదికకు ఒక ప్రక్క త్యాగరాజస్వామి వారి తైలవర్ణచిత్రం గులాబీలూ మల్లెల దండలతో అలంకరింపబడి వుంది.**

# ఉత్సవ మూక

## ఆదూరి వెంకట సీతారామమూర్తి

ఉదయం పూజానంతరం తిరువీధి - ఊరేగింపు కార్యక్రమం. తరువాత పంచరత్న సేవ. వేదికమీద అటు పాతిక మంది, యిటు పాతిక మంది నిష్ణాతులూ, ఔత్సాహికులూ అయిన గాయనీ గాయకులూ, వేదిక మధ్యలో మైకు ముందు శాస్త్రిగారు ఆయన తమ గళాన్ని సరిచేసుకున్నారు - హాలంతా సంగీతప్రియులతో నిండి వుంది.

"జగదానంద కారక ... జయ జానకీ ప్రాణ నాయక..."

త్యాగరాజ స్వామి కీర్తనల్లో ఆణిముత్యాలనదగ్గ పంచరత్న కీర్తనల్లో మొదటి కీర్తనను ఆలపించారు శాస్త్రిగారు - వేదిక మీద కళాకారుల కంఠాలన్నీ ఏక కంఠంగా సేవ మొదలయ్యింది. నాట రాగంలో సాగిన ఆ కీర్తనకు హాల్లో ప్రేక్షక సీట్లలో కూర్చున్న ఔత్సాహిక కళాకారులు తాళం వేయడం ప్రారంభించారు - చూడ్డానికీ వినడానికీ కూడా మనోహరంగా వుందా దృశ్యం.

... ఎల్ల లోకాలకూ ఆనందదాయకమైన వాడా... జానకీరమణా సుగుణాకరా... పాపరహితుడా... అందమైన ముఖము, అమృతమయమైన వాక్కు గలవాడా... ఇంద్రనీల మణుల కాంతివంటి కాంతిగల శరీరము గలవాడా... చంద్ర సూర్యనేత్రుడా... సృష్టి స్థితి లయాలకు కారకుడా... శరణాగతుల్ని పాలించేవాడా... సత్కవుల హృదయాలలో వేంచేసి వుండేవాడా.. దేవముని స్నేహితుడా.. త్యాగరాజాది వరభక్తులు నిన్ను నుతిస్తున్నారు... అనే భావన శ్రావ్యమైన నాట రాగంలో ఒదిగి కళాకారుల కంఠాలగుండా జాలువారి హాలు హాలంతా పరుచుకుంది.

అటు సంగీత వాహినిలో ఓలలాడుతూనే ఒక కార్యకర్తగా ముందు ద్వారానికెదురుగా నిలబడి పర్యవేక్షిస్తూనే వున్నాను - ప్రముఖులు కూర్చున్న ముందు వరుసలో ఒక్క సీటు మాత్రం ఖాళీగా వుంది - రెండు మూడు వరుసల్లో కొన్ని సీట్లు ఎవరికోసమో నిర్దేశింపబడినట్లు ఖాళీగా వున్నాయి.

ఇంతలో ముందు ద్వారం గుండా ఒక వ్యక్తి ప్రవేశించేడు. ఆరడుగుల ఆజానుబాహువు, నెరిసిన తల - తెల్లని పట్టు లాల్చీ, పైజామా వేసుకున్నాడు. అతని వెనుక అతని భార్య కాబోలు ఆకుపచ్చరంగు పట్టుచీరలో వుంది. ఆమెతో పాటు ఓ పదేళ్ల కుర్రాడు. వాళ్లు ముగ్గురూ సరాసరి ముందువరుసలోని ముఖ్యుల్ని దాటుకొంటూ వచ్చి హాలంతటినీ ఓ మారు పరికించి రెండో వరుసలో ఖాళీగా వున్న సీట్లలో కూర్చున్నారు. ఆయనెవరో నాకు ఎప్పుడూ ఎక్కడా చూసినట్టు గుర్తులేదు. ఆహ్వానితులలో ముఖ్యుడో, లేదా అటువంటి ముఖ్యుల బంధువో తెలియలేదు-

"... దుడుకుగల నన్నే దొర కొడుకు బ్రోచురా..."

గౌళ రాగంలో త్యాగరాజస్వామి రెండవ పంచరత్న కీర్తన మొదలయింది. తెలిసిన స్థానిక కళాకారులు కొందరొస్తే వారికి సీట్లు చూపించి కూర్చోబెడుతున్నాను. ఇంతలో పట్టు లాల్చీ ఆసామి లేచి స్టేజీకి దగ్గరగా వెళ్లి చేతిలోని ఫ్లాష్ కెమెరాతో నాలుగైదు ఫోటోలు తీసి వచ్చి భార్య పక్కన కూర్చున్నాడు.

ఉదయ సభ కావటాన, అందులోనూ సెలవుదినం కాకపోవటాన రద్దీ అట్టే లేకపోయినా హాలు సుమారుగా నిండుగానే



వుంది.

కర్ణాటక సంగీత రత్నత్రయంలో అగ్రగణ్యులైన త్యాగరాజస్వామి వారికి ప్రతియేటా తిరువైయూరులో ఆరాధనోత్సవాలు విశేషరీతిలో జరుగుతూండడం, సంగీతమే తన జీవిత ధ్యేయమూ, గమనమూ, అనుకుని ఉచితంగా సంగీతాన్ని నేర్పి ఎన్నో వందల మంది సంగీత కళాకారుల్ని తయారుచేసిన మార్కండేయ శాస్త్రిగారు ఆ ఉత్సవాలకు శిష్యులతో సహా వెళ్లి రావడం కొన్ని ఏళ్లుగా జరుగుతూనే వుంది. అయితే యింతమంది సంగీత కళాకారులూ, అభిమానులూ వున్న యీ పట్నంలో కూడా అటువంటి ఉత్సవాలు శక్తికొద్దీ జరిపి త్యాగరాజస్వామి వారినెందుకు ఆరాధించకూడదూ అనే పట్టుదలతో ఉద్యమించి అభిరుచిగల వారిని సంప్రదించి రెండేళ్ల క్రిందటే మొదటి ఉత్సవం జరిపారు. ఆయన కృషికి తగిన ప్రోత్సాహం లభించింది. ఉత్సవ కమిటీలో నగరానికి చెందిన కొందరు ప్రముఖులు వుండటంవల్ల ఆర్థికపరమైన యిబ్బందులు ఆట్టే లేవు. ఇప్పుడు సంగీతాభిమానులకీ లోటులేదు -

.... ఎందరో మహానుభావులు... మేఘశ్యాముని అందాలు హృదయారవిందములో చూసుకొని బ్రహ్మానందాన్ని పొందేవారెందరో... సామగానం చేసే ధన్యులెందరో... మనస్సనే కోతి సంచారాన్ని నిలుపుచేసి దివ్యమూర్తిని పొడగాంచే వాళ్లెందరో... పారమార్థిక మార్గంలో పరాత్పరుణ్ణి స్వరం, లయ, రాగం తెలిసి పాడే వాళ్లెందరో... భాగవతరామాయణాలు, వేదం, శాస్త్ర పురాణాలు , ఆరు మతాల రహస్యాలూ, ముప్ఫయ్ మూడు కోట్ల దేవతల అంతరంగ భావాలూ తెలిసి, భావ రాగ తాళాల సౌఖ్యం గమనించి చిరాయువూ నిరవధి సుఖమూ అనుభవిస్తూ త్యాగరాజ బంధువులైన వాళ్లెందరో ... రాముడికి యదార్థ దాసులైన వాళ్లెందరో... ఆ మహానుభావులందరికీ వందనాలు... అనే భావనతో స్వరాన్వితమైన



"ఎందరో మహానుభావులందరికి వందనము" అనే ఐదవ ఘనరాగ పంచరత్న కీర్తన సంగీతాభిమానుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది.

అలా ఉదయం పది గంటలకు త్యాగరాజ పంచరత్న సేవ ముగిసింది. కొంత విరామానంతరం సంగీత సభలు మొదలవుతాయి - ఔత్సాహిక, బాల కళాకారులకు పదేసి నిముషాలూ, లబ్ధ ప్రతిష్టులకు పదిహేను, ముప్ఫయ్ నిముషాలూ కేటాయించి అలా మూడురోజులూ రాత్రి తొమ్మిది గంటల వరకూ వుంటాయి.

విరామ కాలంలో ప్రసాద వితరణ కార్యక్రమం మొదలైంది- పట్నంలో ప్రఖ్యాతి గాంచిన ఓ పెద్ద హోటల్ వారు ప్రసాదాలు పంపడానికి ముందుకొచ్చారు. పులిహోర, చక్కెర పొంగలి రెండు వేర్వేరు ఆకు దొన్నెల్లో వేసి అందిస్తున్నారు కార్యకర్తలు - వచ్చేవారిని ఒక వరుస క్రమంలో నిలిపే ప్రయత్నంలో నేనున్నాను.

సరిగ్గా అప్పుడు మళ్లీ చూశానా పట్టు లాల్చీ ఆసామిని. ఈమారు కాస్త పరీక్షగానే చూశాను. స్థానిక రాజకీయ నాయకుడితో కల్పించుకుని మాట్లాడుతున్నాడు. పెద్దగా విరగబడి నవ్వుతున్నాడు. తననందరూ పరికిస్తున్నారో లేదోనని చుట్టూ చూస్తున్నాడూ - కాస్సేపాగి ప్రసాదాలిచ్చే స్థలం వద్దకు వచ్చి "అబ్బొ చాలా క్యూ వుందే. ఇచ్చేయ్యలేరా" అంటూ చెయ్యి చాపేడు - ఒకరిద్దరికి యిచ్చాక అక్కడి కార్యకర్త యితగాడికీ ప్రసాదం యిచ్చేడు -

'క్యూలో రావొచ్చు గదా!' అంటున్నారెవరో - అతగాడు పట్టించుకుంటేనా?

ప్రసాదాలకోసం క్యూ ముందుకు జరుగుతోంది. ప్రసాదం తెచ్చిన రెండు అండాలూ ఖాళీ అవుతున్నాయి - వెంట వెంటనే నిండుతున్నాయి కూడా. జరగబోయే సంగీత సభల గురించీ, ఏర్పాట్ల గురించీ అంతా మెచ్చుకుంటున్నారు. శాస్త్రిగారి కృషిని అందరూ పొగుడుతున్నారు -

"ఊరికొక్కరు చాలు శాస్త్రిగారి వంటివారు. మన సంస్కృతీ సాంప్రదాయాలు రక్షింపబడ్డానికీ. సంగీత సాహిత్య కళారూపాలు వెలుగులోకి వచ్చి అందరికీ అందుబాటులోకి రావడానికీ."

క్యూలో వెనుకనున్న ఎవరో అనడం నా చెవినా బడింది.

మరో కొద్దిసేపట్లో ప్రసాద వితరణ కార్యక్రమం పూర్తయిపోతోందనగా ఆకు దొప్పలు అయిపోయాయి. ఉన్నవారు కొద్దిమందే. అయినా శర్మను పిలిచి వాటిని తెచ్చే పనిని పురమాయించేను. అంతలోకే అక్కడ మిగిలిన కొద్దిమందిలో ఒక ఆసామీ ముందుకొచ్చి,

"అయ్యా దొప్పల అవసరం లేదు - దైవ ప్రసాదం కాసింతైనా చాలు. చేతుల్లో వేసేయ్యేండి" అన్నాడు -

పొందూరు ఖద్దరు లాల్చీ, పంచ, పై మీద కండువాతో వున్నాడతను - దాదాపు యాభై ఏళ్లుండొచ్చు నాతనికి.

'ఔనండీ. దొప్పలు అవసరం లేదు.' అన్నారు మరొకరు.

నిజానికి ఆ కొద్దిమంది కోసం ఆకుదొప్పల్ని తెప్పించనక్కరలేదు. కానీ అందరికీ అన్నీ సమానంగా అందాలి. ఎవరూ నిరాశపడకూడదన్నది శాస్త్రిగారి అభిమతం. అందుకే -

"ఫర్వాలేదు. వచ్చేస్తున్నాయి. ప్రసాదం కావల్సినంత తీసుకోండి" అన్నాను.

కాస్సేపట్లోనే ప్రసాద వితరణ ముగిసింది. హాల్లో కచ్చేరీ ప్రారంభమైంది. అందరూ లోపలికి దారి తీస్తున్నారు - నా వంతు ప్రసాదాన్ని నేనూ తీసుకుని లోపలకు వెళ్లే ప్రయత్నంలో వున్నాను.

ఇంతలో "అయ్యా. ఒక్కమాట!" అని ఎవరో పిల్చినట్లయి వెనుదిరిగి చూశాను. ఆయనే - క్యూలో చివరన ఉండిపోయినాయన. ఖద్దరు లాల్చీ వేసుకున్న యాభైయేళ్ల వ్యక్తి! చేతిలో చిన్న సంచీతో త్వరత్వరగా వస్తున్నాడు.

ఆగి, 'ఏమిటీ' అన్నట్లు చూశాను అతని వంక.

"అయ్యా, తమరు కార్యకర్తల్లా వున్నారు - నాకో చిన్న సహాయం కావల్సి వుంది. శాస్త్రిగార్ని కలవాలో, మీరే అందుకు తగిన వారో నాకు తెలియదు -" అన్నాడు.

"చెప్పండి." అన్నాను.

"మాది సీతారాంపురం. ఈ వూరికి కొత్తవాడిని. కేవలం తమరు జరిపే యీ ఆరాధనోత్సవాల కోసమే వచ్చాను. ఇక్కడ నాకు బంధువులు గాని మిత్రులు గాని ఎవరూ లేరు - భోజనమంటే బయట ఎక్కడన్నా చేయగలను. ఈ రెండు రాత్రులూ ఉండటానికి కాస్త వసతి సదుపాయం వుంటుందేమోనని..."

అతని వివరణలో అభ్యర్ధన వుంది. ఆశ వుంది. అయితే పై వూళ్లనించి వచ్చే సంగీత కళాకారులకైతే భోజన వసతి సదుపాయాలను ఉత్సవ కమిటీ కలుగజేస్తోంది. మరి ... ఇటువంటివారి విషయంలో ...

నా ఆలోచనను గ్రహించిన వాడిలా

"పోనీ నా అభ్యర్థనను శాస్త్రిగారికో, కమిటీ వారికో తెలియజేసినా సరే - లేదా ... నేనే స్వయంగా వారిని ..." అంటూ ఆగేడు. నేనిక ఆలోచించలేను -

"రండి. శాస్త్రిగారితో మాట్లాడదాం." అని, నాతోపాటు శాస్త్రిగారి దగ్గరకు తీసుకువెళ్లి విషయం క్లుప్తంగా చెప్పేను. శాస్త్రిగారు ఒక్క క్షణం తలెత్తి ఆయన వంక చూసేరు.

"అయ్యా నమస్కారం. నాపేరు దీక్షితులు. శాస్త్రీయ సంగీతమంటే ఎనలేని భక్తి, యిష్టం. ఇక్కడికి 160 కిలో మీటర్ల దూరంలో వున్న సీతారాంపురం నుండి వచ్చేను - మీ గురించి చాలాకాలంగా వింటున్నాను - ఇన్నాళ్లకు మీ దర్శన భాగ్యం కలిగింది. అదృష్టవంతుడిని. కేవలం యీ ఆరాధనోత్సవాలను చూచి, విని తరించాలనే ఆశతో నేనిక్కడకి వచ్చాను - క్రితం ఏడాది అనుకున్నా కుదరలేదు. మీ ఏర్పాట్లు కన్నుల పండుగగా వున్నాయి - ఇక వీనులవిందును అనుభవించాల్సిందే. అయితే నాదొక్క చిన్న అభ్యర్థన" అంటూ ఆగాడాయన.

"కూర్చుని చెప్పండి." అంటూ కుర్చీ చూపించేరు శాస్త్రిగారు.

"నేనీ వూరికి కొత్త. నాకిక్కడ బంధుమిత్రులెవరూ లేరు. భోజన ఫలహారాలకు



చింతలేదు - ఈ రెండు రాత్రులూ కాస్త వసతి కల్పించారంటే మీ మేలు మరువలేను - ఏ వరండాలోనైనా నిద్రపోగలను. కాస్త బాత్రూం సదుపాయం కల్పిస్తే..."

"అయ్యో ఎంత మాట! సంగీతాభిమాను లంటున్నారు - కేవలం సంగీత సభలకే అంతదూరం నుండి వచ్చేవమంటున్నారు. నిజానికి మీవంటి వారికోసమే యీ సభలను ఏర్పాటు చేస్తున్నాం. కళాకారులకు మా శక్తిమేర ఆతిథ్యాన్ని యిస్తున్నాం. నేను చెబుతాను - వారితో పాటే మీరు వుండండి. భోజన ఫలహారాలకు కూడా మీరు బయటకు పోనక్కరలేదు -" అన్నారు శాస్త్రిగారు.

దీక్షితులుగారు లేచి శాస్త్రిగారి పాదాలకు నమస్కరించారు.

"పూర్వం రాజాశ్రయంలో సంగీత సాహిత్యాది కళలు రాణించేవని విన్నాం. ఇప్పుడు మీవంటి సత్‌పురుషుల వల్ల, నిస్వార్థపరులైన విజ్ఞులవల్ల రాణిస్తున్నాయన్నవి ప్రత్యక్షంగా చూస్తున్నాం." అన్నాడు.

"నాదేవముంది. సంగీత సాహిత్యాలు పూర్వజన్మ సుకృతాలనుబట్టి అబ్బుతాయి. అవి నేర్పితే వచ్చేవి కావు. ప్రజల్లో దైవచింతన, మన కళల పట్ల అభిరుచి వున్నాయి. మనుషుల విలువల్ని పెంచేవి అవే గదా!" అంటూ శాస్త్రిగారు లేచి, వసతి సౌకర్యాల వ్యవహారాలను చూసే స్వామికి దీక్షితులుగారిని పరిచయం చేశారు.

'కృతజ్ఞుడిని.' అంటూ శాస్త్రిగారి దగ్గర సెలవు తీసుకుని నా వెనుకే హాల్లోకి ప్రవేశించారు దీక్షితులుగారు.


హాల్లోపల - ధన్యాసి రాగంలో... "సంగీత జ్ఞానము భక్తివినా సన్మార్గము గలదే మనసా..." కీర్తన మొదలైంది -

పాడుతున్న అమ్మాయికి పదహారేళ్లుంటాయి. బంగారు రంగు పట్టు పరికిణీ జాకెట్టూ కుంకుమరంగు వోణీ వేసుకుని శాస్త్రోక్తంగా నిర్భయంగా మైకుముందు కీర్తన నాలాపిస్తోంది - ఆమెకు కుడివైపున తొమ్మిదేళ్ల మృదంగ విద్వాన్, ఎడమవైపున ఆ అమ్మాయి తండ్రే వాయులీన సహకారం చూడముచ్చటగా వుంది.

తరువాతి కచ్చేరీ పందొమ్మిదేళ్ల మురళీకృష్ణ వేణుగానం. పేరుకు తగ్గట్టు జయంతశ్రీ, హరిప్రియ రాగాలలో వేణువు వాయించి సభికుల్ని సమ్మోహనపరిచాడు. భోజన విరామ సమయానికి యింకో అరగంట వ్యవధివుందనగా లేచి చూసిననాకు హాలులో జనం పల్చగా వున్నట్టు బోధ పడింది. ఆనాటి కార్యక్రమంలో పాల్గొను కళాకారులూ, వారి బంధుమిత్రులూ కాక సంగీతాభిమానులు మరో పందమందీ తప్ప కన్పించలేదు - హాలంతా మరొక్కమారు పరికించి చూసిన నాకు వెనుక నుండి నాలుగో వరుసలో ఒక మూలగా కూర్చుని కచ్చేరీలు వింటూ అలౌకిక ఆనందాన్ని పొందుతున్న వ్యక్తిని చూసి ముచ్చటేసింది - సంతోషమూ అన్పించింది. ఆ వ్యక్తి దీక్షితులు! లక్షల జనాభా వున్న పట్నంలో కూడా ఆరొందలమందికి సరిపడే ఆ హాలు నిండలేదు - ఎక్కడో మారుమూల పల్లెలోని యీయన వార్తాపత్రిక ద్వారా తెలుసుకుని సంగీతం పట్ల అభిమానంతో ఉత్సాహంగా ఎంతో శ్రమకోర్చి వచ్చాడు. ఎంత తేడా! ఆ ఆనందంతోనే ఆయన దగ్గరగా నడిచివెళ్లి,

"మాష్టారూ. ముందుకు వెళ్లి కూర్చోరాదూ. ముందు సీట్లన్నీ ఖాళీయే" అన్నాను.

"ఎక్కడ కూర్చుంటేనేం బాబూ. సంగీతం శ్రావ్యంగా హాలంతా ఒకే రీతిలో విన్పిస్తోంది. వాతావరణం కూడా చల్లగా ఆ అమృతాన్ని



ఆస్వాదించేలా వుంది. పిల్లలే అయినా సంగీతంలో పిడుగుల్లా వున్నారు. శాస్త్రిగారన్నట్టు అది పూర్వజన్మ సుకృతమే గాని మరొకటి కాదు." అంటూ నవ్వేశారే గాని అక్కడనించి లేచి రాలేదు -సాయంకాలం ఆరుగంటలకు ప్రముఖ మద్రాసు గాయని సమీర కర్ణాటక సంగీత కచ్చేరి అని ప్రత్యేకంగా ప్రకటించారు - ఆమె తన తండ్రిగారైన ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు శ్రీవాత్సవగారి వద్ద తొలి చదువులు నేర్చి తదుపరి సంగీత కళానిధి శ్రీమతి పూర్ణిమగారి వద్ద సంగీతంలోని మెళుకువల్ని నేర్చుకున్నారనీ మద్రాసు యూనివర్సిటీనుండి మ్యూజిక్‌లో ఫస్ట్ రేంకూ సంపాదించాలనీ ఆమెను పరిచయం చేశారు -

ఎన్నో కచ్చేరీలు చేసి మృదువాణిగా ప్రసిద్ధికెక్కిన ఆమె సంగీతం కోసం శ్రోతలు ఐదు గంటలనుండే రావడం మొదలుపెట్టారు.

నిజానికి ఒక కార్యకర్తగా నా పని అప్పుడే మొదలైంది. ప్రముఖులూ, ప్రత్యేక ఆహ్వానితులూ ఆ కచ్చేరీ మిస్ కారు. వారికోసం మొదటి మూడు వరుసలూ ప్రత్యేకించి వుంచాలి. తరువాతి మూడు వరుసలూ నగరంలోని సంగీత విద్వాంసులకూ, కచ్చేరీలు చేయబోతున్న సంగీత కళాకారులకూ, సంగీతాభిమానులకూ కేటాయించాలి. ఈ పనిలో అటు శర్మ... యిటు నేను బిజీగా వున్నాం.

కచ్చేరీ మరో పావుగంటలో ప్రారంభమౌతుందనగా మొదటి నాలుగు వరుసల్లో ఆరేడు సీట్లు మినహా హాలంతా నిండిపోయింది - సరిగ్గా అప్పుడు ప్రవేశించాడా వ్యక్తి - భార్యతో సహా మొదటి ద్వారంలోనుండి. ఉదయం తెల్ల సిల్కు లాల్చీ అయితే ఇప్పుడు పసుపువచ్చ టీషర్టు - నల్ల ఫేంటూ - ముందు వరుసలో కూర్చున్న వ్యక్తుల ముందుగా నడిచి, రెండో వరుసలో కూర్చున్న ఎవరినో పలకరించి చెయ్యి వూపి, మూడో వరుసలోని సీట్లలో కూర్చున్నారు - నా మటుకూ నాకు ఆయన ఎవరైతే గానీ అఖండుడే అన్పించింది.

మలయ సమీరంలా సాగిన సమీర గాత్ర సంగీత కచ్చేరీ, తర్వాత విజయనగరానికి చెందిన కిరణ్మయి గారి వాయులీన వాదనా శ్రోతలను ఎంతగానో పరవశింపజేశాయి.

మర్నాడు ఉదయం తిరుమరావల్లికి చెందిన అరవై ఏళ్ల విద్వాంసుడు రామనాథన్‌గారి గాత్ర కచ్చేరీ తర్వాత విరామ సమయంలో కాఫీకోసం కేఫ్టేరియాకి వెళ్తూంటే దీక్షితులుగారు ఎదురై పలకరింపుగా నవ్వేరు. నేను ఆగగానే - "థాంక్స్ బాబూ - కళాకారులతోపాటు నాకూ



## సుస్మిత ముందు జాగ్రత్త

సుస్మితాసేన్ ఇటీవల ముంబయిలోని ఖార్ ప్రాంతంలో నాలుగు అంతస్థుల భవనాన్ని కొనేసింది. ఒక అంతస్థును తన పెంపుడు కూతురు రీనీకి అట్టే పెట్టి, మిగతా అంతస్థులను అద్దెకిచ్చింది. ఆ డబ్బుతో తను తీసుకున్న బాంక్ అప్పును తీరుస్తుందట. ఓ కొత్త బుల్లి కుక్కపిల్లను కూడా తెచ్చుకుంది. దాని పేరు ఎలిసీ. ఇదంతా కూతురి కోసమేనా? లేక మరింకేదైనా వుందా దీని వెనుక? అని జనం కూపీ లాగే ప్రయత్నాల్లో వున్నారట.

చక్కని ఆతిథ్యమిచ్చారు-" అన్నారు. ఆ మాటల్లో కృతజ్ఞతా భావం.

"దాందేముందిలేండి. మీవంటి పెద్దలు అంతదూరంనించి సంగీతం మీద ప్రేమతో వచ్చారు. అదే చాలు. ఇంతకీ జరిగినంత మట్టుకు కచ్చేరీలపై మీ అభిప్రాయమేమిటి?" అన్నాను. ఆయన నోటంట మెచ్చుకోలు మాటలు నాలుగు వినాలని - ఆయన చిన్నగా నవ్వేరు.

"చెప్పేనుగా - పిల్లలందరూ పిడుగుల్లా తమ ప్రతిభను చూపించేరు. పోతే కిరణ్మయి తన వీణమీద రాగాలతోపాటు మాటల్ని పలికించింది."

"మనవాళ్లు సరే - నేనడిగింది పై రాష్ట్రం నించి వచ్చిన విద్వాంసుల గురించి" అన్నారు.

"చెప్పేకేం - సమీర గొంతులో రాగాలు అద్భుతంగా పలికాయి. ముఖ్యంగా కాపీ రాగంలో 'ఇంత సౌఖ్యమని నే జెప్పజాల...' అన్న కృతి వుంది చూశారూ. ఆ అమ్మాయి చాల అలవోకగా అర్థవంతంగా పాడింది.

.... స్వరరాగలయ ... సుధారసమందు... వరరామమనే కండ చక్కెర మిశ్రము చేసి భుజించే ... శంకరునికి తెలుసును... త్యాగరాజ వినుత... అవే చరణం - ఆమె పాడిన తీరు బాగుంది. ఆ అమ్మాయి కంఠంలో మాధుర్యముంది. శిక్షణ, ఏకాగ్రత ఆమె ప్రతిభను మరొక మెట్టుపైకి తీసుకెళ్లేయనిపించింది.

ఈ ఉదయం కచ్చేరీగూడ విన్నాను - ఆయన పెద్దవారు. సంగీతజ్ఞానం ఉన్నవారు. వారి గురించి చెప్పేదేముంది. అయితే యీ కచ్చేరీలను వింటూంటే నాకొక్క విషయం తోస్తోంది. త్యాగరాజు తెలుగువాడు - ఆయన తెలుగులో రాసిన కృతులను తెలుగురాని, తెలుగు మాతృభాషకానివారు పాడడం వల్ల సంగీతపరంగా బాగున్నా సాహిత్యపరంగా ఆ పాటను అర్థం చేసుకోవడం కష్టమైపోతోంది. ఇది కొందరి విషయంలోనే సుమా. మనవారికన్నా పై రాష్ట్రంవారు త్యాగరాజకృతులను బాగా ఆదరించవచ్చు. అంతమాత్రాన తమ స్వర పాండిత్యాన్ని చాటుకోవడానికి తెలుగు పదాలను సాగదీసి, విరగ్గొట్టి సాహిత్యం అర్థంకాకుండా పాడడం ఎంతవరకూ సబబు? అటువంటి వారిని మనవాళ్లు అనుకరించడం అంత మంచిదికాదు కదా! సాహిత్యం అర్థమయ్యేలా పాట సాగితేనే దాని అందం. క్షమించండి - ఇది నా స్వంత అభిప్రాయం మాత్రమే." అన్నారు.

ఒక బీదస్కూలు మాష్టారిగా కన్పించే యీయనలో ఇంత సంగీత విమర్శనా జ్ఞానం వుందా అన్పించింది. మూడు రోజులూ అతను ఆ చివరి సీట్లోనే కూర్చున్నాడు. చిన్న, పెద్ద తారతమ్యం చూపించకుండా అన్ని కచ్చేరీలనూ ఆస్వాదించాడు - ఈ రోజుల్లో అంతటి అభిరుచి, తీరిక ఎవరికున్నాయి?

చివరిరోజు సాయంకాలం సంగీత ప్రియుల కోరికమేరకు రెండు హుండీలను ఏర్పాటు చేశారు - కానుకలు గుప్తంగా వుంచేందుకు వీలుగా కవర్లను కూడా సిద్ధం చేశారు. నిబంధన లేదు. వత్తిడి లేదు - కళకీ, దైవకార్యానికీ సాయపడాలనుకునేవారు ముందుకు రావొచ్చు. సంగీతప్రియులు మూడురోజులూ ఆనందించి నందుకు వారి సంతోషాన్ని కృతజ్ఞతనీ తెల్పుకునేందుకు అవకాశం.

హాల్లో ఆఖరి కచ్చేరీ సాగుతోంది.

చివరివరకూ వుండలేని జనం వచ్చేస్తున్నారు - వరుసల్లో నిలబడి కాన్కలు హుండీల్లో వేసి మరీ వెళ్తున్నారు - కర్తవ్య నిర్వహణలో వున్న నాకు సిల్కు లాల్చీ వ్యక్తి మళ్లీ కనిపించాడు - చేతిలో కూల్‌డ్రింక్ సీసాతో ఎవరితోనో పెద్దగా మాట్లాడుతున్నాడు. అతని ప్రక్కనే అతని భార్య. ఇటువంటి సభలకు తమవంటివారి వల్లే నిండుదనం అన్నట్లున్నారు - అయితే అతడు గాని ఆమె గాని కవరు తీసుకుని వరుసలో నిలబడే ప్రయత్నం చేయకపోవడం నాకాశ్చర్యాన్నే కలిగించింది.

'మళ్లీ కలుద్దాం' అని చేతులూపి వెళ్లే ప్రయత్నంలో వున్నాడతను. అంతే! నాలోని ఉత్సుకత నన్ను నిలవనీయలేదు - ఒక్క అంగలో వరుగున అతనికెదురుగా వెళ్లి విష్ చేశాను - చిరునవ్వుతో నావంక చూశాడతను.

"మాష్టారూ మిమ్మల్నెక్కడో యింతకుముందు బాగా చూసిన గుర్తు. సంగీత కచేరీలేవన్నా యిచ్చారో... ఎవరిద్వారానో పరిచయమయ్యారో... గుర్తు రావడం లేదు. క్షమించండి..." అన్నాను.

"అబ్బే" అంటూ భళ్లున నవ్వి, 'నేను సంగీత కచ్చేరీలా... నోనో...' 'ఎప్పుడన్నా యిలాగే...' అంటూ, 'మొదటిరోజు పంచరత్న సేవలో మృదంగం వాయించిన చంద్రశేఖర్ మా బ్రదరిన్లా తోడల్లుడు. అతగాడు పట్టుబడితేనే..."

ఒక్కక్షణం కూడా నాకక్కడ వుండబుద్ధి కాలేదు - కాన్కల కోసం తీసుకెళ్లిన ఖాళీ కవర్లను యివ్వకుండానే తిరిగొచ్చి హుండీ దగ్గర కూలబడ్డాను.

హాల్లో కచ్చేరీ చివరికొచ్చేసింది. తర్వాతి అంశం మంత్రపుష్పం. రాత్రి తొమ్మిది దాటిందేమో జనం బయటికొచ్చేస్తున్నారు -

"మాష్టారూ ఓ కవరిస్తారా" ఎదురుగా **దీక్షితులుగారు!**

"మీరూ వచ్చేసేరా" అన్నాను ఆశ్చర్యంగా.

"మంత్రపుష్పం బావుంటుంది. అయ్యేక ప్రసాదం తీసుకువెళ్లండి" అన్నాను తిరిగి.

"చివరి బస్సు పదిగంటలకు వుంది. అయ్యేక ప్రసాదం తీసుకు వెళ్లండి" అన్నాను తిరిగి.

"చివరిబస్సు పదిగంటలకొచ్చింది. మా చెల్లెలిగారి వూరువెళ్లి తెల్లారి వెళ్లిపోవాలి - " అన్నాడతడు. ఈ బీద సంగీతప్రియుడు ఏ గుప్త కానుకను సమర్పిస్తాడో అనుకుంటూ కవరు అందించానతనికి. అందుకుని వెళ్లిపోయాడు. నా హడావుడిలో నేనుండడంవల్ల మళ్లీ అతగాడిని చూడటం అవలేదు.

000

ఉత్సవ కార్యక్రమం ముగిసింది. మర్నాడు హుండీలలోని కాన్కలను లెక్కించే పని శాస్త్రిగారి యింట్లో - మేము వూహించిన మొత్తం మొదటి హుండీలోనే వచ్చేసింది. రెండవ హుండీలోని ఒక కవరు మమ్మల్నందర్నీ ఆకర్షించింది. ఆ కవర్ని నాకు అందించేరు శాస్త్రిగారు - కవరు అతికించి వుంది. జాగ్రత్తగా చింపితే అందులో ఓ చిన్న కాగితపు పొట్లము, రెండు చిన్న కాగితాల మీద ముత్యాల కోవలాంటి అక్షరాలతో ఒక ఉత్తరమూ -

శాస్త్రి గారి అనుమతితో ఆ ఉత్తరం చదవడం మొదలుపెట్టేను.

సరస్వతీ పుత్రులైన శ్రీ శాస్త్రిగారికి -నమస్కారములు.

ఏనాటి పుణ్యఫలమో యీ ఆరాధనోత్సవాలలో ఓలలాడే అదృష్టం. ప్రత్యేక ఆహ్వానితుడిని కాకపోయినా మీ ఆతిథ్యానికి అర్హుడనైనందుకు సంతోషం. అందుకు కృతజ్ఞతలు. గత రెండేళ్లుగా నా కోరిక ఈ యేడు ఫలవంతమైంది. నేటి నాగరికతా ప్రపంచంలో మీవంటి సంగీత ప్రియులు, విద్వాంసులు ఉచితంగా శాస్త్రీయ సంగీతాన్ని నేర్పిస్తూ మన సంపదలైన కళలపట్ల రేపటి తరానికి అభిరుచినీ ఆశనూ కలిగిస్తూండడం ఎంతైనా హర్షించదగ్గ విషయం. నిజంగా గొప్ప విషయం - అందులో భాగంగా తెలుగువాడైన త్యాగయ్యకు మనరాష్ట్రంలో కూడా ఆరాధనోత్సవాలు జరిపించడం, వివిధ ప్రాంతాలలోని ప్రఖ్యాతులైన సంగీత కళాకారులతోపాటు స్థానికంగా వున్న బాల, వర్ధమాన గాయనీ గాయకులకూ కళాకారులకూ కూడా అవకాశమిచ్చి వారి ప్రతిభకు పట్టం కట్టడం చెప్పుకోదగ్గ విశేషం. ఇది పొగడ్త కాదు. మావంటివారు ఎంత మెచ్చుకున్నా అది మీ కృషిముందు దిగదుడుపే.

రామభక్తి సామ్రాజ్యంలో త్యాగరాజస్వామివారు ఎన్నోవేల కృతులను రచించారు - పోయినవి పోగా మనకు లభ్యమైనవి కొన్ని వందలు మాత్రమే - ఆ వందల కృతులలో ఏ కొన్నిటినో నేర్చుకుని సాధనతో కచ్చేరీలిచ్చి తద్వారా కీర్తి శిఖరాల నధిరోహించిన మహనీయులున్నారు. లక్షలు సంపాదించిన విద్వాంసులూ వున్నారు - వారంతా తమ తర్వాతి తరం వారికి ఏమందించారో నాకైతే తెలియదు.

త్యాగయ్య రచించిన అతి కొద్ది కీర్తనలనే నేర్చుకునే అదృష్టం నాకు కలిగింది - ఈ వల్లెపట్టున వుండి వాటినే యిక్కడి వారికి నేర్పిస్తూ పొట్ట పోసుకుంటున్నాను - సంగీతం నాకు జీవనోపాధే అయినా శిష్యులకు సంగీతం మీద యిష్టం ఏర్పడేటట్టే బోధిస్తున్నాను - అదే నాకు సంతృప్తి. త్యాగయ్య, ముత్తుస్వామి దీక్షితులూ, పురంధర దాసూ నాజీవిత నావను నడిపిస్తున్న మహానుభావులు. వారిని నమ్ముకుని బ్రతుకుతున్న నేను మీరుచేస్తున్న యీ నిస్వార్థ సేవలో పాలువంచుకోవాలని యిక్కడికి వచ్చేవరకూ తెలియలేదు -

త్యాగధనుడైన ఆ త్యాగయ్యకేమివ్వగలను? నా మొదటి సంవత్సరం సంపాదనలోంచి కొన్న ఓ చిన్ని ఉంగరాన్ని మీ ద్వారా స్వామి సేవకు సమర్పించుకుంటున్నాను. అదృష్టం కలిసొస్తే వచ్చే సంవత్సరం రావడానికి ప్రయత్నిస్తాను. శెలవ్.

-దీక్షితులు.

పొట్లం విప్పి దీక్షితులు సమర్పించిన కానుకను చేతిలోకి తీసుకున్నారు శాస్త్రిగారు - వీణబొమ్మ చెక్కిన బంగారు ఉంగరమది! శాస్త్రిగారి వంక చూడబోయేడు.

కనురెప్పల మధ్య నీటిపొర అడ్డంగా నిలిచింది! ■

## అడ్వాన్స్ బుకింగ్

యాక్షన్ హీరో అక్షయ్ కుమార్ కొడుకు వయసు పదకొండు నెలలు. పేరు ఆరవ్. తండ్రితో పాటు సెట్ల మీదిక్కూడా వచ్చేస్తున్నాడు ఆరవ్. తండ్రి చుట్టుపక్కలుంటే చాలు, కనిపించిన వారందరి తోటీ తప్పటడుగులు వేసుకుంటూ నడిచి పోతున్నాట్ట. బాలీవుడ్ నిర్మాతా, ఆత్మల కథలు విపరీతంగా తీసి డబ్బు చేసుకున్న కేశూ రామ్‌సే, ఆరవ్‌ను తెరకు పరిచయం చేసే అదృష్టం తనకు కలిగించమని అక్కీకి ముందుగానే అర్జీ పెట్టేసుకున్నాట్ట. ఎప్పుడో ఇరవై ఏళ్ల నాటి మాట కదా!

